పంచాయతీల్లో పడకేసిన పాలన

- అందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు
- గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి
- కార్యదర్శులపై పెరిగిన పనిఒత్తిడి



నూతనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం

నూతనకల్ : గ్రామపంచాయతీలో పాలన పడకేసింది. సర్పంచుల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి పల్లెపాలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంచాయతీ ఖాతాల్లో డబ్బులు లేక ఎన్నో పనులకు ఆటంకాలు కలుగుతున్నాయి. నిధులు సకాలంలో రాకపోవడంతో ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతుంది. ఫిబ్రవరి 2వరకు సర్పంచ్‌లు, పాలకవర్గాలకు జీపీల బాధ్యత ఉండేది. గ్రామంలో ఏ పని కావాలన్నా వారే ముందు ఖర్చు చేసి తర్వాత బిల్లులు డ్రా చేసుకునే వారు. వారి పదవీకాలం ముగిసిన తర్వాత ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడింది. జీపీలకు నిధులు రాకపోవడంతో కార్యదర్శులు సొంతంగా రూ.వేలల్లో ఖర్చులు చేస్తున్నారు. పారిశుద్ధ్యం, వీధిదీపాల నిర్వహణ తదితర పనులకు కార్యదర్శులే సొంతంగా వెచ్చిస్తున్నారు. ఖాతాల్లో డబ్బులు లేకున్నా వారు పాలనను ముందుకు నెట్టుకొస్తున్నారు. నిధులు విడుదలలో జాప్యం జరగడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుకే ప్రత్యేకాధికారులు..

పాలకవర్గాల పదవీ కాలం పూర్తయిన తర్వాత పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. వారు ఇప్పటికే వారి ఇతర బాధ్యతల్లో తీరిక లేకుండా ఉన్నారు. ఇలాంటి సందర్భంలో అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరికి రెండు, మూడు పంచాయతీల బాధ్యతలు ఉన్నాయి. దీంతో వారు జీపీల పాలనను పెద్దగా పట్టించుకోవడం లేదు. కనీసం వారంలో ఒక్కసారి కూడా గ్రామాలకు రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. కార్యదర్శులే ముఖ్యమైన పనులు, సంతకాల కోసం ప్రత్యేకాధికారుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

వేతనాలు ఇవ్వలేని దుస్థితి..

మండలంలోని 17గ్రామపంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావడం లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఏడాదికి నాలుగు సార్లు పంచాయతీలకు అందజేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు రెండేళ్లుగా రావడం లేదు. నిధులు సకాలంలో రాకపోవడంతో అప్పటి పాలకవర్గాల సభ్యులు జేబులో నుంచి ఖర్చు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో పంచాయతీల నిర్వహణకు సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాల్సి ఉన్నా.. చాలా గ్రామాలకు ఇవి సరిపోవడం లేదు. దీంతో కార్మికులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితులు నెలకొన్నాయి. చిన్న పంచాయతీలలో ట్రాక్టర్ల నిర్వహణ కష్టంగా మారింది.

క్లుప్తంగా

నేడు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

సూర్యాపేట : పట్టణ పరిధిలోని ఇమాంపేట మిషన్ భగీరథ వాటర్‌ప్లాంట్ నుంచి సూర్యాపేట పట్టణానికి తాగునీరు అందించే ప్రధాన పైపులైన్ మరమ్మతులకు గురైనందున బుధవారం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

చందా మహేష్‌కు డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న మహేష్

తుంగతుర్తి : మండలం పరిధిలోని గొట్టిపర్తి గ్రామానికి చెందిన చందా మహేష్ వ్యాయామ విద్యలో జేఎన్టీయూ నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆయన వ్యాయామ విద్యలో 'ప్రిడిక్షన్ ఆఫ్ ప్లేయింగ్ ఎబిలిటీ ఆఫ్ కబడ్డీ, ప్లేయర్ అంత్రప్రోమెట్రిక్, ఫిజికల్ ఫిట్నెస్ కాంపోనెంట్స్' విభాగంలో చేసిన పరిశోధనలకు గాను ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, ప్రొఫెసర్ దిలీప్ కుమార్‌ల చేతుల మీదుగా మంగళవారం డాక్టరేట్ పట్టాను అందుకున్నట్లు ఆయన వెల్లడించారు. మహేష్‌కు డాక్టరేట్ రావడం పట్ల మండలానికి చెందిన పలువురు అభినందించారు.

నూతన కమిటీ ఎన్నిక



అర్వపల్లి లింగయ్య, జిల్లా అధ్యక్షుడు



వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి

సూర్యాపేట : పట్టణంలోని మిర్చి మార్కెట్ యార్డులో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా ద్వితీయ మహాసభలను నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అర్వపల్లి లింగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరబోయిన వెంకన్నతో పాటు 12మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

నూతనకల్లు : మండల కేంద్రంలోని బిలివర్స్ ఈస్టర్న్ చర్చిలో మంగళవారం పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నకిరెకంటి సైమన్, ఉపాధ్యక్షుడిగా మరికంటి ఇర్మియా, ప్రధాన కార్యదర్శిగా పిట్లల సామేల్, కోశాధికారిగా నకిరేకంటి మనష్షేతో పాటు మరికొంత మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దైవజనులు రెమిడాల రూబెన్, వీరేష్, బాలునాయక్, వీరారెడ్డి పాల్గొన్నారు.

రైతుబీమాకు 5వరకు గడువు



దరఖాస్తు స్వీకరిస్తున్న ఏఓ మల్లారెడ్డి

అర్వపల్లి : నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే నెల 5వరకు గడువు ఉందని మండల వ్యవసాయ అధికారి కె.మల్లారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని రామన్నగూడెం, తిమ్మాపురం రైతు వేదికలలో రైతుల నుంచి ఆయన రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జాజిరెడ్డిగూడెం మండలంలో కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు 1432మంది ఉండగా ఇప్పటి వరకు 590 మంది రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకున్నారని, మిగిలిన రైతులు కూడా వెంటనే రైతు వేదికలలో ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు శోభారాణి, నేరెళ్ల సత్యం, సిబ్బంది వర్ష, రైతులు పాల్గొన్నారు.

కళాకారుల హర్షం

నూతనకల్లు : ప్రభుత్వం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు పీఆర్సీ ప్రకటించడం పట్ల సాంస్కృతిక సారథి జిల్లా కళాకారుడు గంట భిక్షపతి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ ప్రకటించడంతో రూ.24,514ల వేతనం రూ.31వేలకు పెరిగిందని, దీంతో కళాకారుల ఆర్థిక ఇబ్బందులు తొలగనున్నాయన్నారు. కళాకారులందరం ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు.

వక్ఫ్‌బోర్డు అధికారుల సర్వే అడ్డగింత



అధికారుల సర్వేను అడ్డుకుంటున్న గ్రామస్తులు

తుంగతుర్తి : మండలంలోని వెంపటి గ్రామంలో సయ్యద్ సారాజ్ ఉసేని బాబాదర్గాకు సంబంధించిన సర్వే నంబర్ 649లో గల సుమారు 21ఎకరాల 20గుంటల వక్ఫ్‌బోర్డు భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని సయ్యద్ జాకీర్ హుస్సేన్ ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశాడు. అందుకు స్పందించిన అధికారులు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆదేశాల మేరకు మహమ్మద్ మహమూద్ తమ సిబ్బందితో స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారుల సహకారంతో మంగళవారం సర్వే చేపట్టారు. ఈ సర్వేను గ్రామస్తులు అడ్డుకున్నారు. తాము పూర్వం నుంచి ఈ భూమిలోనే నివాసం ఉంటూ, మాతాత ముత్తాతలు ఇక్కడే ఇల్లు కట్టుకున్నారని, ఇప్పుడు తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తమ ఇంటి స్థలాలను ఎలా సర్వే చేస్తారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో సీఐ శ్రీనునాయక్ గ్రామస్తులకు నచ్చజెప్పి పంపించారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు వక్ఫ్‌బోర్డ్ అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థి చదువుకు ఆర్థికసాయం



రాజీవ్‌సాగర్‌కు తన సర్టిఫికెట్లు చూపిస్తున్న విద్యార్థి రెడ్డిమల్ల రాజేష్

తుంగతుర్తి : మండలంలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి రెడ్డిమల్ల రాజేష్ (ఆర్టిఎల్ డిజైన్ అండ్ వెరిఫికేషన్) కోర్సు అభ్యసించడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో విషయాన్ని గ్రామానికి చెందిన తెలంగాణ మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ దృష్టికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. దీంతో స్పందించిన రాజీవ్‌సాగర్ 6నెలల పాటు కోర్సు పూర్తి చేయడానికి అయ్యే ఖర్చును ప్రతి నెల రూ.20వేల చొప్పున మొత్తం రూ.లక్ష 20వేలను ఇటీవల ఆర్థికసాయంగా అందజేశారు. దీంతో విద్యార్థి రాజేష్ కోర్సు పూర్తి చేసి సర్టిఫికెట్ పొందడంతో మంగళవారం రాజీవ్‌సాగర్ కలిసి కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా మేడే రాజీవ్ సాగర్ మాట్లాడుతూ.. కష్టపడి చదవడానికి అవకాశం ఉండి, ఆర్థికంగా వెనుకబడిన రాజేష్‌కు చేయూతనివ్వడం తనకు సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో రాజేష్ గ్రామానికి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థుల అవగాహన



అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మణిదీప్



తిరుమలగిరి (తుంగతుర్తి) : తాటిపాములలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీహెచ్.మణిదీప్ అన్నారు. మంగళవారం అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చునాయక్, హెచ్ఎం ఎం.విజయలక్ష్మి, పీఈడీ పి.మల్లేష్, సూపర్‌వైజర్ లలిత, ఏఎన్‌ఎం జ్యోతి, ఆశకార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తాటిపాముల హెచ్‌ఎం శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని తాటిపాముల పాఠశాల విద్యార్థులకు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సంధ్యారాణి, ఆశవర్కర్ సునీత, ఉపాధ్యాయులు ప్రభాకర్, సీత, లింగయ్య, సంతోష్‌కుమార్, బాలకిషన్, వెంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా రిటైర్డ్ ఉద్యోగుల జన్మదిన వేడుకలు



సామూహిక జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో మంగళవారం రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూలై మాసంలో జన్మదినం ఉన్న రిటైర్డ్ ఉద్యోగులను సంఘం సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ట్రెజరర్ హమీద్‌ఖాన్, మండల కార్యదర్శి ఎస్.నాగేశ్వర్‌రావు, సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, వీరయ్య, సోమయ్య, టి.లక్ష్మీకాంతారెడ్డి, పి.రామారావు, వి.రాములు, జి.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రవీందర్

పెన్‌పహాడ్ : మానవ అక్రమ రవాణా చేయడం నేరమని అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ పెరిక రవీందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యంతో యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఆర్థికంగా ఎదగాలని, విద్యార్థులను బెదిరించడం, బలవంతం చేయడం, అసభ్యంగా ప్రవర్తించడం, మోసం చేయడం, అపహరించడం, అక్రమ రవాణా కొరకు ప్రేరేపించడం చేస్తే చట్ట ప్రకారం నేరమన్నారు. అక్రమ రవాణాకు పాల్పడితే చైల్డ్ టోల్ ఫ్రీ నంబర్ 100, 1098, 112లకు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ రవి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ లాలునాయక్, ఏపీఎం అజయ్‌నాయక్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ కళావతి, హెచ్ఈఓ సునంద, హెల్త్ సూపర్‌వైజర్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలి



తిరుమలగిరి (తుంగతుర్తి) : నాగారంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు కిరణ్

తిరుమలగిరి : బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నేడు (బుధవారం) నిర్వహించే చలో అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.కిరణ్, పీవైఎల్ జిల్లా నాయకుడు వేముల గణేష్ కోరారు. మంగళవారం నాగారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో ఇచ్చిన విధంగా 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి 7.3శాతమే నిధులు కేటాయించారని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరారు. అదే విధంగా విద్యాశాఖకు మంత్రిని నియమించాలని కోరారు. సమావేశంలో భాస్కర్, సాగర్, నాగరాజు, స్వామి, నరేష్, పవన్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆత్మకూర్(ఎస్) : నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని, రాష్ట్రంలో అన్ని శాఖలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని కోరుతూ నేడు అసెంబ్లీ ముట్టడిని చేపడుతున్నట్లు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కోశాధికారి బండి రవి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా విద్యారంగానికి కేవలం 7.3శాతం నిధులు కేటాయించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. గత ప్రభుత్వం లాగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తుందన్నారు. కొఠారి కమిషన్ నివేదిక ప్రకారం విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయిస్తేనే విద్యారంగం మెరుగుపడుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ చేయాలన్నారు. వివిధ సమస్యల సాధన కోసం నేడు జరిగే అసెంబ్లీ ముట్టడిలో నిరుద్యోగులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరుమలగిరి : నాగారం మండలంలోని లక్ష్మాపురం పాఠశాలలో పనిచేసిన హెచ్‌ఎం జలగం ఏకస్వామి ఇటీవల బదిలీపై వెళ్లారు. మంగళవారం పాఠశాల ఆవరణలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సుధాకర్, నర్సింహారావు, అంగన్‌వాడీ టీచర్ కవిత, లింగమ్మ, ఇందిరమ్మ, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ చేయాలని వినతి



అదనపు కలెక్టర్ లతకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : ఒకే కుటుంబంలోని ఓట్లన్నీ ఓటరు జాబితాలో ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకుని ఓటరు జాబితాను సవరణ చేయాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు కోరారు. ఈ మేరకు మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ బీఎస్ లతకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత స్థానిక ఎన్నికలను ఒకే కుటుంబంలోని ఓట్లు, ఒకే వార్డులో ఉండకుండా వేరొక వార్డులోకి మారాయని, ఆ ఓటర్ల లిస్ట్ ప్రకారమే ఎన్నికలు జరగడంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసే స్వతంత్ర గుర్తులను, వివిధ వార్డుల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రచారానికి ఇబ్బందులు తలెత్తున్నాయన్నారు. రానున్న సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో విడుదల చేయనున్న ఓటరు జాబితాలో ఒకే కుటుంబంలోని ఓట్లు ఒకేచోట ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో తెలంగాణ యువజన సంఘం నాయకులు ఏనిగ సంతోష్‌రెడ్డి, ధరావత్ వెంకటేష్‌నాయక్, భాషపంగు సునీల్, చెరుకు నగేష్, మధుసూదన్, స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో నిత్య పూజలు ప్రారంభం



విజయశంకర స్వామికి నీరు ఆరబోస్తూ స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని గట్టికల్లు గ్రామంలో గల పురాతన అభయ వీరాంజనేయ స్వామి దేవాలయంలో నిత్య దీప ధూప నైవేద్య పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల ప్రారంభానికి అతిథులుగా అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయశంకర స్వామి, ఖదిజ్ఞాసి మల్లికావల్లభ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణ భక్తుల చేతుల్లోనే ఉందన్నారు. సనాతన సంస్కృతి సంప్రదాయాలను ముందు తరాలకు అందించాలంటే ముఖ్యంగా ఆలయాలదే ప్రధాన పాత్ర అన్నారు. పురాతన దేవాలయం గ్రామంలో ఉండడం శుభపరిణామమని, వందల ఏళ్లుగా పూజలకు నోచుకోని అభయ వీరాంజనేయస్వామికి నిత్యం పూజలు నిర్వహించుకునే మహా కార్యానికి శ్రీకారం చుట్టడం సంతోషించదగిన విషయమన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భజనలతో విజయశంకరస్వామికి వీధుల్లో నీరు ఆరబోస్తూ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు ఖదిజ్ఞాసి గుండు వెంకన్న, ఆలయ పూజారి వలవోజు గోవర్ధనాచారులు, శాస్త్రీయ సంగీత గురువు శ్రీబాలసుబ్రహ్మణ్యం, భజన బృందం కళాకారులు, తవుడోజు సైదులు, మోరపాక ఉగ్రయ్య, మడ్డి హనుమయ్య, సామలింగారెడ్డి, సామ వెంకటరెడ్డి, కోన రామ్‌బద్రి, కుమ్మరి భిక్షం, మోహనంది మల్లయ్య, అనంతుల లక్ష్మయ్య, ఏర్పుల భిక్షం, ఏర్పుల శ్రీరాములు, బండ గొర్ల సోమయ్య, గుండు సత్తయ్య, గుండు అబ్బయ్య, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలతో పాటు పీఆర్సీ ప్రకటించాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీపీయూఎస్ జిల్లా అధ్యక్షురాలు సంధ్యారాణి, నాయకులు

నూతనకల్లు : పెండింగ్ డీఏలతో పాటు పీఆర్సీని వెంటనే ప్రకటించాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షురాలు పర్వతం సంధ్యారాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పాటు మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలో టీపీయూఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రకటిస్తూ రెండో పీఆర్సీ నివేదికను తెపించుకొని 50శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్సీని అమలు చేయాలని కోరారు. మహిళా ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రెండు సంవత్సరాలు శిశు సంరక్షణ సెలవులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలలో స్కావెంజర్లను, అటెండర్లను నియమించాలని, గత బదిలీలో వేరే పాఠశాలకు బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నేరెల్లా దేవరాజు, మండల అధ్యక్షుడు యామ సంతోష్, నాగిరెడ్డి జితేందర్ రెడ్డి, మన్నె శ్రీదేవి, గుండా స్వాతి, సువర్ణలక్ష్మి, ప్రశాంతి, భిక్షం, మధుసూదన్‌రెడ్డి, శోభన్, అశోక్, అనిత తదితరులు పాల్గొన్నారు.


అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదు



పోలీస్‌స్టేషన్‌లో ఎదుట ఆందోళన చేస్తున్న జీపీ కార్మికులు

ఆత్మకూర్(ఎస్) : గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, వారి పనికి తగిన వేతనాలు ఇవ్వకుండా అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదని సీఐటీయూ మండల కన్వీనర్ యాతాకుల వెంకన్న అన్నారు. మంగళవారం గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నా వెళ్తున్న కార్మికులను మండల పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేకిగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు నీలం అశోక్, నాయకులు మండల వీరన్న, మాతంగి నాగయ్య, బొడ్డు పిచ్చయ్య, ములకలపల్లి సైదమ్మ, మేడి వెంకన్న, బొడ్డు అయిలి, ములకలపల్లి నాగమ్మ, ములకలపల్లి పిచ్చయ్య, గడ్డం సంధ్య, సాకాని రాము తదితరులు ఉన్నారు.

రెండో విడత రుణమాఫీపై సంబరాలు



చివ్వెంల : రైతు రుణమాఫీ సందర్భంగా రైతువేదికలో సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న రైతులు, అధికారులు

చివ్వెంల : రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత రైతు రుణమాఫీ చేయడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో మంగళవారం రైతులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ధరావతు వీరన్ననాయక్, వెన్న మధుకర్‌రెడ్డి, ఎండీ జాఫర్, గుగులోతు నాగునాయక్, వెంకన్న, ఉపేందర్ పాల్గొన్నారు.



అర్వపల్లి : రామన్నగూడెం రైతువేదికలో సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న రైతులు

అర్వపల్లి : రెండో విడత రుణమాఫీపై మంగళవారం మండలంలోని రామన్నగూడెం రైతువేదిక వద్ద సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, నాయకులు వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు శోభారాణి, సత్యం, ఆత్మ బీటీఎం శ్వేత, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

పంట రుణాల మాఫీ హర్షణీయం

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాలను మాఫీ చేయడం హర్షణీయమని యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ముక్కాల నాగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లు మాట తప్పకుండా పంట రుణాలను మాఫీ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట నాయకులు గొండ్యాల రమేష్, యాకయ్య, మల్లం సతీష్, నల్లగంటి నరేష్, తదితరులు ఉన్నారు.